

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 05-07-2026 సంపుటి: 08 సంచిక 24 పేజీలు: 8 వెల: రూ 3-00



# డీజిల్, పెట్రోల్‌పై ఇంధన కంపెనీలకు 75 వేల కోట్ల నష్టం: ప్రధాని మోదీ



బలోత్రా: పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. అయితే ఆ అంశంపై విపక్షాలు ప్రజల్ని భయాందోళలనలకు గురి చేశాయని, ప్రజల్ని తప్పుదోవ పట్టించారని ప్రధాని మోదీ(ఖఓ ఓనీటతి) అన్నారు. రాజకీయ క్రీడలు ఆడారని విమర్శించారు. కానీ చెడు ప్రయత్నాలు చేసిన వాళ్లు సక్సెస్ కాలేదన్నారు. చిన్న చిన్న అవరోధాలు తప్ప, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంధన సరఫరాలో పెద్దగా సవాళ్లు ఎదురు కాలేదని మోదీ అన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో.. వివిధ ఇంధన కంపెనీలు డీజిల్, పెట్రోల్‌పై సుమారు 75 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయని అన్నారు. అయితే ఆ నష్టాన్ని ప్రభుత్వమే భరించిందన్నారు. లీటరుపై ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించినట్లు మోదీ తెలిపారు. ప్రజలపై ఎటువంటి అదనపు భారం పడకుండా చూశామన్నారు. ఇవాళ రాజస్థాన్‌లోని బలోత్రాలో పెట్రోకెమికల్ రిఫైరీని ప్రారంభించిన తర్వాత మోదీ ప్రసంగించారు.పశ్చిమాసియా యుద్ధ సమయంలో..వివిధ దేశాలతో ఉన్న స్నేహసంబంధాలు భారత్‌కు కలిసి వచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభానికి ముందు కేవలం 26 దేశాల నుంచి మాత్రమే భారత్ ఇంధనాన్ని దిగుమతి చేసుకునేదని, కానీ సంక్షోభ సమయంలో భారత్ తన దౌత్య బలాన్ని ప్రదర్శించిందని, వార్ జరుగుతున్నా.. సుమారు 40 దేశాల నుంచి భారత్ ఇంధనాన్ని దిగుమతి చేసుకున్నట్లు చెప్పారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే కీలకమన్న విషయాన్ని ప్రభుత్వం చాటి చెప్పిందన్నారు. తీవ్రమైన ఇంధన సంక్షోభం ఉన్నా.. అమితమైన అనుభవం వల్ల ఆ సంక్షోభం నుంచి బయటపడినట్లు ఆయన చెప్పారు.గత దశాబ్ద కాలం నుంచి విజయవంతమైన విధానాల అమలు ద్వారా ఆ సంక్షోభ పరిస్థితి నుంచి గట్టెక్కినట్లు ఆయన తెలిపారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20 నుంచి ప్రారంభం..

## వెల్లడించిన కిరణ్ రిజిజు



న్యూ ఢిల్లీ, ఈ ఏడాదికి సంబంధించి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగష్టు 13 వరకు సమావేశాలు కొనసాగుతాయి. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం వెల్లడించారు. ఈ సమావేశాల్లో దేశానికి సంబంధిచిన కీలక అంశాలపై చర్చిస్తామన్నారు. పార్లమెంట్ ఉభయ సభల వర్షాకాల సమావేశాలకు సంబంధించి ప్రభుత్వ సిఫారసు మేరకు ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని కిరణ్ రిజిజు తెలిపారు.దేశానికి సంబంధించిన అంశాలపై సానుకూల చర్చ జరుగుతుందని ఆశిస్తున్నట్లు కిరణ్ రిజిజు అన్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల పలు కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఓడిపోవడం, బీజేపీ అధికారంలోకి రావడం, ఆ పార్టీకి చెందిన ఎంపీలు రెబల్స్‌గా మారడం, ఉద్ధవ్ థాక్రే శివసేనలో మరోసారి చీలిక, ఆప్ ఎంపీలు బీజేపీలో చేరడం వంటి పరిణామాలు ఎన్‌డీయే కూటమికి సానుకూలంగా మారనున్నాయి. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ, ఎన్‌డీయే కూటమి అభ్యర్థులు ఎక్కువగా విజయం సాధించారు. దీంతో ఉభయ సభల్లో ప్రభుత్వ బలం పెరగనుంది.గతంలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర మరోసారి సభలో ప్రవేశపెట్టబోతుంది. ఇదే సమయంలో నీట్ పేపర్ లీక్ అంశంతోపాటు చమురు ధరల పెరుగుదల ప్రతిపక్షాలకు అస్త్రంగా మారనున్నాయి. గత పార్లమెంట్ బడ్జెస్ ప్రత్యేక సమావేశాల తర్వాత ఈ సభ జరగనుంది. దీంతో ఇటు ఈ సభ అటు ఎన్‌డీయే కూటమికి, ఇటు ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌కు కీలకం కానుంది.

## అల్లూరి ఆశయాలే దేశానికి మార్గదర్శకం: పవన్ కల్యాణ్

అమరావతి, జులై 4 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. వీర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా, ఆ స్వాతంత్ర్య సమరయోధుడికి ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి, గిరిజన ప్రజల హక్కులు, గౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు.భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అల్లూరి సీతారామరాజు చిరస్థాయిగా నిలిచిపోయారని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఆయన పోరాటం కేవలం ఒక ఉద్యమం మాత్రమే కాదని చెప్పారు. ధైర్యం, త్యాగం, దేశభక్తిని ఎన్నటికీ మరిచిపోలేమని అన్నారు.అల్లూరి ఆశయాలే దేశానికి మార్గదర్శకమని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యాన్ని కాపాడాలంటే బాధ్యతతో జీవించాలని... దేశాన్ని బలోపేతం చేయాలంటే సేవాభావంతో ముందుకు సాగాలని... సమాజం కోసం నిలబడటమే నిజమైన దేశభక్తి అని అల్లూరి సీతారామరాజు జీవితం మనకు నేర్పుతుందని చెప్పుకొచ్చారు. స్ఫూర్తి పొంది, న్యాయం, సేవ, దేశభక్తి వంటి విలువలనుఆచరిస్తూ,అభివృద్ధిచెందిన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములం కావాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

# కుప్పంలోనూ బంగారం ఉత్పత్తి చేస్తాం: సీఎం చంద్రబాబు




చిత్తూరు: కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కుప్పంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్‌ను ప్రారంభించామని, కుప్పంలో కూడా బంగారు గనులు ఉన్నాయని చెబుతున్న నేపథ్యంలో వాటిని అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించిందని, ప్రస్తుతం వివాదాల్లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారుటీటీడీ నిధులతో రూ.34 కోట్ల వ్యయంతో కుప్పంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కుప్పం అభివృద్ధిపై గత ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. కుప్పానికి నీళ్లు తీసుకొచ్చామని సినిమా సెట్టింగులు వేసి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. కుప్పానికి వచ్చే ప్రతి ఒక్కరికీ కొత్త అనుభూతి కలిగేలా ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్ వంటి పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కుప్పం సమగ్ర అభివృద్ధి కోసం సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఈ క్రమంలోనే రాజకీయాలపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల విషయంలో తాను ఎప్పుడూ సౌమ్యంగానే ఉంటానని, అయితే సంఘ విద్రోహ శక్తుల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తానని స్పష్టం చేశారు. సీమ ఫ్యాక్షనిజంపై సినిమాలు తీసే రోజులు పోయాయని, ఇప్పుడు రాయలసీమలో పరిస్థితులు పూర్తిగా మారాయని అన్నారు. మరో రెండేళ్లలో తన రాజకీయ జీవితం 50 ఏళ్లు పూర్తవుతుందన్నారు. రాష్ట్రంలో రౌడీలు రాజకీయాల్లోకి రావడం వల్లే అనేక దుర్ఘటనలు జరిగాయని విమర్శించారు. వివేకానంద రెడ్డి హత్య, కోడి కత్తి వంటి ఘటనలకు, తనను బాధ్యుడిగా చేశారని సీఎం చంద్రబాబు విమర్శించారు. అలాగే, మాస్క్ అడిగిన డాక్టరును చనిపోయేలా చేశారని.. డ్రైవరును కారు డిక్కిలో పెట్టి డోర్ డెలివరీ చేశారని.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.రాజధాని అంశంపై కూడా సీఎం స్పందించారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిన తర్వాత రాజధానిని మార్చడం సాధ్యం కాదని అన్నారు. అమరావతికి బదులుగా కొత్త పేర్లతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. అమరావతి అభివృద్ధినే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో వరల్డ్ క్లాస్ స్పోర్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



## జెఎస్ డబ్ల్యు సంస్థ సహకారంతో ఏర్పాటు చేస్తాం
## క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకచర్యలు చేపడుతున్నాం
## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 3శాతం రిజర్వేషన్
## ఎలైట్ ప్లేయర్స్ తో మంత్రి లోకేష్ విందు సమావేశం

అమరావతి: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు జెఎస్ డబ్ల్యు సంస్థ ముందుకు వచ్చిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. కామన్ వెల్త్, ఆసియా గేమ్స్ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఎలైట్ ప్లేయర్స్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో శుక్రవారం రాత్రి డిన్నర్ మీట్ నిర్వహించారు. ఆద్యంతం ఆహ్లాదంగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై క్రీడాకారుల నుంచి సలహాలను స్వీకరించారు. క్రీడాకారుల కుటుంబ నేపథ్యం, ప్రారంభంలో వారు ఎదుర్కొన్న సవాళ్లు, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహం వంటి వాటిపై క్రీడాకారులను వాకబుచేశారు. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ... గతంలో ఆంధ్రప్రదేశ్ లో మంచి కోచ్ లు ఉండేవారని, 2019లో ప్రభుత్వం మారాక వారందరినీ తొలగించారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో గుంటూరులో చంద్రబాబుగారు విదేశీ కోచ్ లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఏర్పాటుచేశారని అన్నారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ... పాలకులు మారినా పాలసీలు మారకూడదన్నారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి అత్యుత్తమ కోచ్ లను ఏపీలో ఏర్పాటుచేసి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తీసుకొస్తామని అన్నారు. రాష్ట్ర అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు జెఎస్ డబ్ల్యు సంస్థ అంగీకారం తెలిపింది. ఇందుకు అవసరమైన ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియాలో గ్రిఫిత్ యూనివర్సిటీ విద్యతో క్రీడలకు ప్రత్యేక శిక్షణ అందిస్తోందని తెలిపారు. అక్కడ కరిక్యులమ్‌ను అథ్లెటిక్స్‌కు అనుగుణంగా రూపొందించారని అన్నారు.రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. స్పోర్ట్స్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్ పై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నామని అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సహిస్తోందని చెప్పారు.




# సంపాదకీయం

ఆదివారం 05-07-2026

## కాళ్ల బేరానికి పాకిస్తాన్

అనధికార సమావేశాలు జరగడం కొత్తేమీ కాదు. కానీ ఒక్కసారిగా పాక్ భారత్‌ల మధ్య ఒక సంవత్సర కాలంలో 6 సార్లు ఈ సమావేశాలు జరగడం, భారత తరపున మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద నరవానే, మాజీ దౌత్యవేత్త రుచి ఘనశ్యామ్, బిజెపి నాయకులు రామ్‌మాధవ్ పేర్లు ప్రస్తావించబడ్డాయి. పాకిస్తాన్ తరపున రహమాన్, సజ్జయిడ్ హైదర్ ఖాన్, పూర్వ ఐఎస్ఐ నేతలు తదితరుల పేర్లు మీడియాలో వచ్చాయి. ట్రాక్ 1.5, ట్రాక్ -2 దౌత్యం అధికారిక ప్రభుత్వ చర్చలుకావు. మాజీ దౌత్యవేత్తలు, రిటైర్డ్ సైనికాధికారులు, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులు, థింక్ ట్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొని పరస్పర అభిప్రాయాలు పంచుకునే వేదికగా వీటిని భావిస్తారు. ప్రపంచంలోని అనేక సంక్షోభ ప్రాంతాల్లో ఇలాంటి చర్చలు గతంలో కూడా జరిగాయి. గత ఏడాది జులైలో లండన్‌లో జరిగిన ఐఐఎస్ఎస్ ట్రాక్ -1.5 సమావేశంతో ఈ శ్రేణి చర్చలు మళ్లీ వార్తల్లోకి వచ్చాయి. భారత్- పాకిస్తాన్ సంబంధాలు గత ఏడు దశాబ్దాలుగా యుద్ధాలు, ఉగ్రవాద దాడులు, సరిహద్దు ఉద్రిక్తతలు, దౌత్య వివాదాలతో సాగుతున్నాయి. ముఖ్యంగా పుల్వామా దాడి అనంతరం ఇరుదేశాల మధ్య అధికారిక దౌత్యచర్చలు దాదాపు నిలిచిపోయాయి. ఉగ్రవాదం, చర్చలు రెండూ కలిసి సాగవు అనే విధానాన్ని భారత్ పదేపదే ప్రకటించింది. అయితే ఇటీవలి ఏడాది కాలంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. లండన్‌కు చెందిన అంతర్జాతీయ వ్యూహాత్మక పరిశోధనా సంస్థ ఐఐఎస్ఎస్ నిర్వహించిన సమావేశాలు లేదా దాని సదస్సుల సందర్భంగా భారత్ -పాకిస్తాన్ ప్రతినిధుల మధ్య ట్రాక్-1.5, ట్రాక్ -2 స్థాయి అనధికారిక చర్చలు జరిగినట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామం దౌత్య, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇవన్నీ బిజెపి పూర్వ ప్రధాన కార్యదర్శి, ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు రామ్‌మాధవ్, ఆర్ఎస్ఎస్ నాయకులు దత్తాత్రేయ హోస బోలె అమెరికా, యూరోప్ పర్యటనల తరువాత మరింతగా బలం పుంజుకొన్నాయి. దత్తాత్రేయ హోస బోలె ఇటీవల పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో, భారత్ పాక్‌ల మధ్య సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రజల మధ్య చర్చలు కొనసాగాలని తెలిపారు. దీన్ని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ సంచాలక మోహన్ భగవత్ కూడా సమర్థిస్తూ ప్రకటన చేశారు. పాక్‌పట్ల మొదటి నుండి వ్యతిరేకంగా ఉండే ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు, ఒక్కసారిగా తమ పద్ధతి మార్చుకొని, పాక్‌పట్ల మెతక వైఖరితో వ్యవహరించడంలో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి ఉందనే ప్రచారం జరుగుతుంది. ఆపరేషన్ సిందూర్ తరువాత అమెరికా వైఖరి పూర్తిగా పాక్‌కు అనుకూలంగా ఉండడం, యుద్ధాన్ని మేమే ఆపామని ట్రంప్ ప్రకటించడం, ఆ తరువాతి వ్యాపార ఒప్పందం సంఘటనలు అన్నీ ఈ వాదనకు బలం ఇస్తున్నాయి. ఇరాన్ అమెరికా యుద్ధ విరామంలో కూడా పాక్ చురుకుగా పాల్గొనడంతో, అమెరికా పూర్తిగా పాక్‌కు అనుకూలంగా, భారత్‌పై ఒత్తిడి తెస్తుందా అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ అనధికార సమావేశాలు జరగడం కొత్తేమీ కాదు. కానీ ఒక్కసారిగా పాక్ భారత్‌ల మధ్య ఒక సంవత్సర కాలంలో 6 సార్లు ఈ సమావేశాలు జరగడం, భారత తరపున మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద నరవానే, మాజీ దౌత్యవేత్త రుచి ఘనశ్యామ్, బిజెపి నాయకులు రామ్‌మాధవ్ పేర్లు ప్రస్తావించబడ్డాయి. పాకిస్తాన్ తరపున రహమాన్, సజ్జయిడ్ హైదర్ ఖాన్, పూర్వ ఐఎస్ఐ నేతలు తదితరుల పేర్లు మీడియాలో వచ్చాయి. ట్రాక్ 1.5, ట్రాక్ -2 దౌత్యం అధికారిక ప్రభుత్వ చర్చలుకావు. మాజీ దౌత్యవేత్తలు, రిటైర్డ్ సైనికాధికారులు, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులు, థింక్ ట్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొని పరస్పర అభిప్రాయాలు పంచుకునే వేదికగా వీటిని భావిస్తారు. ప్రపంచంలోని అనేక సంక్షోభ ప్రాంతాల్లో ఇలాంటి చర్చలు గతంలో కూడా జరిగాయి. గత ఏడాది జులైలో లండన్‌లో జరిగిన ఐఐఎస్ఎస్ ట్రాక్ -1.5 సమావేశంతో ఈ శ్రేణి చర్చలు మళ్లీ వార్తల్లోకి వచ్చాయి. భారత, పాకిస్తాన్ మాజీ దౌత్యవేత్తలు, భద్రతా నిపుణులు, వ్యూహకర్తలు ఇందులో పాల్గొన్నట్లు మీడియా నివేదించింది. ఆ తరువాత అక్టోబర్‌లో ఒమన్‌లోని మస్కట్‌లో జరిగిన దక్షిణ ఆసియా రక్షణ సంవేశం సందర్భంగా మరో ట్రాక్ -1.5 సమావేశం జరిగినట్లు సమాచారం వెలువడింది. ఈ సమావేశంలో కూడా ఇరు దేశాల మాజీ అధికారులు, వ్యూహాత్మక నిపుణులు పాల్గొన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. డిసెంబర్‌లో థాయ్‌లాండ్‌లో మరో ట్రాక్ 2 సమావేశం జరిగింది. ఇది ఎమీూ కార్యక్రమం కాకపోయినా, భారత్- పాక్ మధ్య అనధికారిక సంభాషణల శ్రేణిలో భాగంగా ప్రస్తావించబడింది. ఇందులో మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ దౌత్యవేత్తలు, విద్యావేత్తలు పాల్గొన్నట్లు నివేదికలు వచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఖతార్ రాజధాని దోహాలో మరో ట్రాక్ -2 సమావేశం జరిగింది. బ్రిటన్‌కు చెందిన ఒక థింక్‌ట్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కూడా ఇరుదేశాలకు చెందిన మాజీ దౌత్యవేత్తలు, వ్యూహాత్మక నిపుణులు పాల్గొన్నట్లు సమాచారం వెలువడింది. అత్యంత చర్చనీయాంశమైన సమావేశం జూన్‌లో శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన సందర్భంగా వెలుగులోకి వచ్చింది. ఈ సదస్సు పక్కన భారత్- పాకిస్తాన్ ప్రతినిధుల మధ్య అనధికారిక చర్చలు జరిగినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. కొంత మంది భారత, పాకిస్తాన్ ప్రముఖుల పేర్లు మీడియాలో ప్రస్తావించబడ్డాయి. అయితే వారిలో కొందరు తాము పాల్గొనడాన్ని బహిరంగంగా ఖండించగా, ఎమీూ కూడా పూర్తి పాల్గొనేవారి జాబితాను విడుదల చేయలేదు.

# మమతా బెనర్జీకి మరో షాక్..

**పార్టీకి రాజీనామా చేసిన బెంగాల్ టీఎంసీ అధ్యక్షురాలు చంద్రిమా భట్టాచార్య**

న్యూ ఢిల్లీ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వరుసగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి మరో షాక్ తగిలింది. మమతకు అత్యంత సన్నిహితురాలు, పశ్చిమ బెంగాల్ టీఎంసీ అధ్యక్షురాలు చంద్రిమ భట్టాచార్య టీఎంసీకి రాజీనామా చేశారు. పార్టీకి చెందిన అన్ని పదవులకు శనివారం రాజీనామా చేశారు. ఇకపై పార్టీకి పూర్తి దూరంగా ఉండనున్నట్లు ప్రకటించారు. ఒక పార్టీ రాష్ట్ర



అధ్యక్షురాలు రాజీనామా చేయడం అంటే ఆ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలినట్లే. టీఎంసీకి చెందిన అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నట్లు, కాలిఘాట్‌లో మమతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చంద్రిమ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. టీఎంసీకి చెందిన వివిధ బ్యాంకు అకౌంట్లకు సంబంధించి బాధ్యతల నుంచి కూడా తప్పుకొంటున్నట్లు, అలాగే, తన సంతకాన్ని కూడా వాటి నుంచి తొలగిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఇకపై, పార్టీ కార్యకలాపాలకు సంబంధించిన లావాదేవీల విషయంలో ఆమె సంతకం చెల్లదు. పార్టీకి సంబంధించిన అంశాల్లో తన పేరును ప్రస్తావించకూడదని, మమత తరఫున తనను సంప్రదించకూడదని కూడా చంద్రిమ.. ఎన్నికల సంఘాన్ని కోరింది. అయితే, తన రాజీనామాకు గల కారణాన్ని చంద్రిమ వెల్లడించలేదు. ఉన్నట్లుండి ఆమె తన పదవులకు రాజీనామా చేయడం బెంగాల్ రాజకీయాల్లో? సంచలనంగా మారింది. మరోవైపు చంద్రిమ రాజీనామాపై టీఎంసీ కూడా స్పందించలేదు. ఇప్పటికే టీఎంసీకి అనేక మంది కీలక నేతలు రాజీనామా చేశారు. మరోవైపు అటు ఎంపీలు, ఇటు ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేశారు. టీఎంసీ తిరుగుబాటు ఎమ్మెల్యేలకు రితబ్రత బెనర్జీ నాయకత్వం వహిస్తున్నారు. ఆయనకు అసెంబ్లీలో టీఎంసీ తరఫున ప్రతిపక్ష నేతగా గుర్తింపు దక్కింది. తిరుగుబాటు అంశం ప్రస్తుతం ఎన్నికల సంఘం పరిశీలనలో ఉంది. మమతా బెనర్జీ వర్గానికి, రితబ్రత వర్గానికి ఈసీ నోటీసులు జారీ చేసింది. వారి స్పందన తర్వాత ఈసీ నిర్ణయం తీసుకోనుంది.

# శ్రీ సత్య సాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ ఆస్పత్రికి హరీశ్ రావు ఏడాది వేతనం విరాళం

మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు గొప్ప మనసు చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో శ్రీ సత్య సాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ & రీసెర్చ్ సెంటర్‌ను హరీశ్ రావు, సినీ నటుడు విజయ్ దేవరకొండతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అందిస్తున్న అమూల్యమైన సేవలను గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శ్రీ సత్య సాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ ఆసుపత్రికి నా ఒక సంవత్సరం



వేతనాన్ని డొనేట్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ రోజే చెక్ కూడా అందిస్తానన్నారు. ఇంకా ప్రాణం ఉంటుందో.. పోతుందో ఎలా అని కొట్టుమిట్టాడుతున్నట్వంటి వారికి ఇది నిజంగా ఒక దేవాలయం. దేవుడి ఎలా వరమిస్తాడో నేను బతుకుతానో పోతానో అని ఇక్కడికి వచ్చినట్వంటి వారికి ఈ ఆస్పత్రి ప్రాణ ప్రతిష్ట చేస్తుంది. అప్పుడే పుట్టిన పిల్లలకు గుండె ఆగిపోతుంది. గుండెలో రంధ్రాలున్నాయి. హార్ట్‌లో సమస్య ఉందన్నపుడు ఆ తల్లిదండ్రుల ప్రాణాలు విలవిల్లాడుతుంటాయి. ఎవరికైనా బిడ్డ పుడితే చాలా ఆనందంగా ఉంటుంది. కానీ ఆ పుట్టిన బిడ్డ గుండెకు రంధ్రాలున్నాయి. ఆ పుట్టిన బిడ్డ ఇక బతకడం కష్టమన్నప్పుడు తల్లిదండ్రుల ప్రాణాలు విలవిలలాడుతుంటాయన్నారు. శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రి ఇప్పుడు ఒక చిన్నారికి శస్త్ర చికిత్స చేసిందంటే నా దృష్టిలో ఒక గుండెను కాపాడలేదు.. ముగ్గురి గుండెలను కాపాడినట్టు. విలవిలలాడే ఆ రెండు గుండెలకు ధైర్యాన్నిచ్చి మీ బిడ్డకు ప్రాణం పోస్తున్నాం అని అటు ప్రాణం పోసిన బిడ్డకు తల్లిదండ్రుల గుండెలకు ప్రాణం పోసినంత గొప్ప అని హరీశ్ రావు చెప్పారు.

# మూలాలను మర్చిపోవద్దు : వైఆర్పీ ఫౌండేషన్ చైర్మన్ యెలిశాల రవి ప్రసాద్

**విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ**

నల్లగొండ, జూలై 04 : ఎంత ఎదిగినా తమ మూలాలను మరిచి పోవద్దని వైఆర్పీ ఫౌండేషన్ చైర్మన్ యెలిశాల రవి ప్రసాద్ అన్నారు. వైఆర్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైఆర్పీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదివి, మంచి నడవడికతో ముందుకు సాగాలని కోరారు. తమ ఫౌండేషన్ ద్వారా ఈ ఏడాది రూ.80 లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 41 మంది విద్యార్థులకు రూ.12 లక్షలు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలని సూచించారు. తమ సంస్థ చదివే విద్యార్థులకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. స్కాలర్‌షిప్‌లను ఉపయోగించుకుని మంచిగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. విద్యార్థులు మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థితికి చేరుకున్న తర్వాత సమాజానికి తోటి విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని చేసిన మేలును మరవద్దని చదువుతోపాటు సంస్కారం కూడా నేర్చుకోవాలన్నారు. ఎవరికి ఇష్టం ఉన్న రంగంలో వారు పట్టుదలతో అంకితభావంతో కష్టపడి చదువుకుని బంగారు భవిష్యత్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వై.ఆర్.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిదిస్తున్నామని అలాగే ప్రతి సంవత్సరం మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలు ఇలానే కొనసాగుతాయన్నారు. ఈ సంవత్సరం సుమారు 80 లక్షల రూపాయల స్కాలర్‌షిప్‌లను 100 మందికి పైగా విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. ఎంత ఎదిగినా కూడా కుల, మత, వర్గ బేధాలు లేకుండా ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలన్నారు. నల్లగొండ కార్పొరేటర్ యామా కవిత మాట్లాడుతూ.. విద్యా దానం అన్నిటికంటే ఎక్కువ అని, ఆది సమాజంలో మార్పు తెస్తుందని అన్నారు. సాయం పొందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఆర్పీ ఫౌండేషన్ డైరెక్టర్ శరత్ చంద్ర, జిల్లా ఇన్‌చార్జి యామా దయాకర్, రవి ప్రసాద్, రాఘవా చారి పాల్గొన్నారు.




## 'మాజీ సీఎం రోశయ్య సేవలు మరువలేనివి'



తుంగతుర్తి, జూలై 04 : మాజీ ముఖ్యమంత్రి రోశయ్య ఉమ్మడి ఏపీకి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ సీతయ్య అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఈగ నాగన్న ఆధ్వర్యంలో మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు సంతోష్, కేదారి, వీరయ్య, సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, నాగన్న, వినయ్, సుభాష్ పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్ చంద్రశేఖర్



మిర్యాలగూడ, జూలై 04 : ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను బీఎల్‌ఓలు, అధికారులు సమిష్టిగా పారదర్శకంగా నిర్వహించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని నందిపాడులో ఇంటింటి సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. అర్హులైన వారి ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేలో నమోదు చేయాలని సూచించారు. రాజకీయ పక్షాల నాయకులు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలన జరిపి ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫారాలు నింపి క్రమంలో నిరక్షరాస్యులు ఉన్నట్లయితే బి ఎల్ ఓ బాధ్యత తీసుకుని సరైన సమాచారాన్ని ఓటర్ల నుండి తీసుకుని ఫారాలను పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తాసీల్దార్, ఆర్ఐ ఉన్నారు.

## బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్



ఇల్లెందు, జూలై 04 : గ్రామాలలో బీఆర్ఎస్ బలోపేతానికి పార్టీ ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అన్నారు. శనివారం ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ఇల్లెందు మండల బీఆర్ఎస్ బీఎల్ఏ లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు సవరణ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి మండలం, ప్రతి మండలంలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ బి ఎల్ ఏ లు, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కలిసి తమ పరిధిలోనే ఓటరు సవరణ కార్యక్రమంలో పాల్గొని వారికి అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాలని సూచించారు. మరి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామాలలో విరివిగా ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్క ఓటరుకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబాల నుండి ఓటరు సవరణలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, లకావత్ దేవిలాల్, బండారి శ్రీను, ఎట్టి వీరభద్రం, గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, హరిప్రసాద్ యాదవ్, ఇల్లెందు మండలానికి చెందిన అన్ని గ్రామాల నుండి బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

## ట్యాంకుల్లో తెచ్చి.. పంటకు ప్రాణం పోస్తూ

తాండూరు ,గత నెల రోజులుగా వరుణుడు కరుణించకపోవడంతో వానకాలంలో కంది, పత్తి పంటలు విత్తుకున్న రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు వాహనాల్లో ట్యాంకులు పెట్టి పైపుల ద్వారా నీరు అందిస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాం డూరు నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల మెట్ట భూములుండగా అందులో 90 శాతం రైతులు పంటలు విత్తు కున్నారు. పైర్లు మొలక దశలోనే ఎండిపోతుండగా మరికొన్ని ప్రాంతాల్లో అసలు మొక్కలే మొలవడం లేదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిలో యాలాల మండ లంలోని చెన్నారం గ్రామానికి చెందిన అచ్చయ్య అనే రైతు తాను సాగు చేసిన పత్తి పంటను రక్షించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వాహనం లో ట్యాంకు పెట్టి పైపు ద్వారా పత్తి మొక్కలకు అం దిస్తున్నారు. ఇప్పటికే నాలు గుసార్లు పంటకు నీరు అందించినట్టు చెప్పారు.

# మారుతోన్న రాయలసీమ

కర్నూలు, జూలై 4,రాయలసీమ నుంచి ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చారు. రాయలసీమ కేంద్రంగా ఎందరో రాజకీయాలు చేశారు. కానీ ఆ స్థాయిలో రాయలసీమ మాత్రం అభివృద్ధి చెందలేదు. కానీ కూటమి వచ్చిన తరువాత రాయలసీమ రూపురేఖలు మారుతున్నాయి. దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమై, రాజకీయ శంకుస్థాపనల డ్రామాతో విసిగిపోయిన కడప స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో ఎట్టకేలకు ఒక బలమైన ముందడుగు పడింది. కడప స్టీల్ ప్లాంట్ కు శ్రీకారం చుట్టనున్నారు. ఇది కేవలం కొబ్బరికాయలు కొట్టే మరో సాంప్రదాయక భూమి పూజ కాదు. పక్కాగా నిర్మాణ పనుల ప్రారంభోత్సవం. జిందాల్ ఆధ్వర్యంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ తొలి దశ ఉత్పత్తిని అత్యంత వేగంగా అందుబాటులోకి తెచ్చేలా ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఇది నిజంగా రాయలసీమ చరిత్రలో సువర్ణ అధ్యాయం. ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో వివాదాల మయంగా మారిన రాయలసీమ.. ఇప్పుడు పారిశ్రామికంగా.. రాయల పరిశ్రమల సీమగా రూపాంతరం చెందుతూ ఉండడం శుభపరిణామం.ఉత్పత్తి రంగానికి సంబంధించిన పరిశ్రమలు రాయలసీమలో ఏర్పాటు అవుతున్నాయి. అయితే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా నిలబెట్టడంలో శ్రీ సిటీ కీలక పాత్ర పోషించింది. గ్లోబల్ కంపెనీలకు క్యారాఫ్ అడ్రస్ గా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ జరుగుతున్న పరిశ్రమల జాతర ఒక ఎత్తు అయితే.. ఇటీవల ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ రంగాల్లో వచ్చిన పెట్టుబడులు మరో ఎత్తు. రాయల్ ఎన్ఫీల్డ్, హీరో మోటో కార్ఫ్ వంటి దిగ్గజ సంస్థలు రాయలసీమలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో తమ ప్లాంట్లను నిర్మించాయి. వేలాదిమంది స్థానిక యువతకు, గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించాయి. గతంలో వచ్చిన కియా మోటార్స్ అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించింది. అయితే ప్రస్తుతం శ్రీ సిటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పారిశ్రామిక వైభవానికి సరికొత్త కేంద్రంగా మారింది.అన్నింటికీ మించి రాయలసీమ గ్రీన్ ఎనర్జీ రంగంలో దేశంలోనే టాప్ హబ్ గా మారింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో గ్రీన్ కో, ఆర్సలర్ మిట్టల్, ఐర్ఈడిఏ భాగస్వామ్యంతో ప్రపంచంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులు వేగం గా రూపుదిద్దుకుంటున్నాయి. గతంలో వెనుకబడిన ప్రాంతంగా.. కరువు సీమగా ముద్రపడిన రాయలసీమ.. ఇప్పుడు పరిశ్రమలకు స్వర్గధామంగా మారింది. అటు బెంగళూరు ఐటి, ఆటోమొబైల్ క్యారీడర్.. ఇటు చెన్నై పోర్టులకు కనెక్టివిటీ ఉండడంతో రాయలసీమ కు ప్లస్ పాయింట్ గా నిలుస్తోంది. ప్రధానంగా ఖనిజ సంపద, ఇనుప ఖనిజం, సున్నపురాయి నిల్వలు భారీ సిమెంట్, స్టీల్ పరిశ్రమలకు బలమైన పునాదులుగా మారాయి. బలమైన రాజకీయ సంకల్పం, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుండడంతో రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యం అవుతుంది.ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడు ఏ టర్న్ తీసుకుంటాయో ఊహించడం చాలా కష్టం. నిన్నటి వరకూ ఓ లెక్కన సాగిన రాజకీయం.. నేటి ఉదయానికి మరోలా మారిపోతుంది. అధికార టీడీపీ కూటమి, విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో.. "క్రెడిట్" అనే అంశం చాలా కీలకంగా మారుతోంది. ఏ అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి అయినా మేమంటే మేమే కారణమనే వైఖరి పార్టీలలో కనిపిస్తోంది. మొన్నటి గూగుల్ డేటా సెంటర్ మొదలుకుని.. నేటి కడప స్టీల్ ప్లాంట్ వరకూ పొలిటికల్ పార్టీలు ఈ" క్రెడిట్"ను తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉండగా.. ఆయా పార్టీల మద్దతుదారులు సోషల్ మీడియాలో వీటిని హోరెత్తిస్తున్నారు.వైఎస్సార్ కడప జిల్లాలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రెండు దశాబ్దాల రాయలసీమ ప్రజల కల ఈరోజు నెరవేరిందన్నారు. సున్నపురాళ్లపల్లిలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించి ఈ కలను నిజం చేశామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం శంకుస్థాపనలతో సరిపెట్టి ప్రజలను మభ్యపెడితే... మేం పనులు మొదలుపెట్టి రాయలసీమ స్టీల్ ప్లాంటుకు వాస్తవరూపం ఇస్తున్నామని పనిలోపనిగా వైసీపీపైనా విమర్శలు చేశారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు చంద్రబాబు.కడపలో స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. సజ్జన్ జిందాల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్ బృందానికి అభినందనలు తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమైన మైలురాయిగా జగన్ అభివర్ణించారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంటూ ట్వీట్ చేశారు. ఎన్నో ఏళ్ల కృషి, ప్రణాళిక అనే పునాదులపై ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు నిర్మితమవుతాయన్న వైఎస్ జగన్.. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కడప స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కీలకమైన పునాదులు వేశామన్నారు.పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపు, భూముల కేటాయింపు, రహదారుల అనుసంధానం వంటి మౌలిక సదుపాయాల కోసం భూమిని అందించామన్నారు. ఈ కారణాలతోనే ప్రాజెక్టు వేగంగా కదిలిందన్న జగన్.. కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా ఈ ప్రాజెక్టు పనులు నిలిపివేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా పనులు ప్రారంభం కావటం సంతోషకరమంటూ జేఎస్‌డబ్ల్యూ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు.మరోవైపు జగన్ చేసిన ట్వీట్‌కు సజ్జన్ జిందాల్ రిప్లై ఇచ్చారు." మీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు, జగన్ గారు..మీ ప్రభుత్వ హయాంలో లభించిన ప్రారంభ అనుమతుల నుంచి నేటి ఈ ప్రారంభోత్సవం వరకు సాగిన ఈ ప్రయాణం నిరంతర కృషికి నిదర్శనం. ఈ ప్రాంత యువత, కుటుంబాల కోసం ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా పూర్తి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము." అంటూ జిందాల్ ట్వీట్ చేశారు. సజ్జన్ జిందాల్ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో టీడీపీ వర్సెస్ వైసీపీగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతుల ద్వారానే కడప స్టీల్ ప్లాంట్ సాధ్యమైందని స్వయంగా జిందాల్ చెప్పారని వైసీపీ మద్దతుదారులు ట్వీట్లు చేస్తున్నారు. జగన్ హయాంలో వేగంగా ఇచ్చిన అనుమతులతోనే ఈ ప్రాజెక్టు కల సాకారమవుతోందని.. టీడీపీ ప్రభుత్వం క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని విమర్శిస్తున్నారు. అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన నీరు, కరెంట్, రహదారులు వంటి మౌలిక వసతులు అభివృద్ధి చేసి.. పనులు ప్రారంభమయ్యేలా చేసింది చంద్రబాబు ప్రభుత్వమని టీడీపీ శ్రేణులు కౌంటరిస్తున్నాయి.

# రాజధాని చుట్టూ మరోసారి రగడ..

విజయవాడ, జూలై 4, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. రాజధాని అభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, ప్రతిపక్షం నుంచి వస్తున్న రాజకీయ వ్యాఖ్యలు కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా రాజధాని భవిష్యత్తుపై వస్తున్న ప్రకటనలు పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాలు, ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ) అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో నిలిచిపోయిన అనేక అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించడంతో పాటు, దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు ప్రభుత్వం కొనసాగిస్తోంది. మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, విద్యా సంస్థల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.అయితే ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన "మావిగన్" వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి. ఈ ప్రకటనతో రాజధాని అంశం మరోసారి ప్రధాన రాజకీయ అజెండాగా మారింది. ఈ పరిణామాలు అమరావతి అభివృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా పెట్టుబడుల విషయంలో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం అమరావతిలో పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార సంస్థలు పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయి. కానీ రాజధానిపై తరచూ రాజకీయ వివాదాలు కొనసాగితే కొంతమంది పెట్టుబడిదారులు నిర్ణయాలు వాయిదా వేసే పరిస్థితి ఏర్పడవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. పెట్టుబడులకు స్థిరమైన వాతావరణం చాలా అవసరమని వారు సూచిస్తున్నారు.రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ఈ తరహా రాజకీయ చర్చల ప్రభావం ఉండొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రాజధాని అంశంపై వచ్చిన వివిధ నిర్ణయాల కారణంగా నిర్మాణ రంగం మందగించిన పరిస్థితులు కనిపించాయి. ప్రస్తుతం తిరిగి నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్న సమయంలో మరోసారి అనిశ్చితి ఏర్పడితే అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభావం పడే అవకాశాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు.అమరావతి పరిసర ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు కూడా క్రమంగా విస్తరిస్తున్నాయి. కొత్త సంస్థలు, సేవా రంగ సంస్థలు, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయి. ఇలాంటి సమయంలో రాజకీయ ప్రకటనలు వ్యాపార నిర్ణయాలపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలపరిచే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయనే సందేశాన్ని స్పష్టంగా చేరవేయడం, రాజధాని నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రణాళికలను ప్రజలకు వివరించడం కూడా కీలకమని చెబుతున్నారు.మొత్తంగా చూస్తే అమరావతి అంశం కేవలం రాజకీయ చర్చకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో ముడిపడి ఉంది. అందువల్ల రాజకీయ విభేదాల కంటే అభివృద్ధి, స్థిరత్వం, ప్రజల విశ్వాసానికి ప్రాధాన్యం ఇచ్చే నిర్ణయాలే రాష్ట్ర భవిష్యత్తుకు మరింత ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి వర్సెస్ మావిగన్ చర్చ తెరపైకి వచ్చింది. 2029 ఎన్నికల్లో మావిగన్ ఎజెండాతో ప్రజల్లోకి వెళతామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యాఖ్యలతో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కూటమి పార్టీలు కూడా అప్పుడు మూడు రాజధానులు, ఇప్పుడు మావిగన్ పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని జగన్‌కు కౌంటర్ ఇస్తున్నాయి. తాజాగా అమరావతి వర్సెస్ మావిగన్ అంశంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ రెండు అంశాలపై తన అభిప్రాయాలను చెప్పుకొచ్చారు. టీడీపీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమేనని చెబుతోందని.. వైఎస్సార్‌సీపీ మావిగన్ అంటోందని.. ఒక బాధ్యత కలిగిన ఒక పౌరుడిగా రెండు రాజకీయపార్టీలు చేస్తున్న భిన్న అర్థరహిత వాదనలు చూసిన తర్వాత తన అభిప్రాయాలను అందరితో పంచుకుంటున్నాను అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధానిని ఎక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై గతంలో శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను వీరంతా ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. 2014లో రాష్ట్ర విభజన జరిగిందని.. 12 ఏళ్లు అవుతున్నా సరే ఇంకా రాజధాని ఎక్కడ ఉండాలనే చర్చ జరుగుతోందని.. ఇది అందరూ సిగ్గుపడాల్సిన విషయమన్నారు. రాష్ట్రం విడిపోయిన 15 ఏళ్ల తర్వాత.. అంటే 2029లో మరోసారి సార్వత్రిక ఎన్నికలు రానున్నాయని.. ఆ ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలు మరోసారి నిర్ణయించాలా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజధాని పేరుతో చేస్తున్న ఈ పొలిటికల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను ఆపేయాల్సిన బాధ్యత అన్ని పార్టీల మీదా ఉందా? లేదా? అన్నారు.అమరావతిలో మొదటి విడతలో ల్యాండ్ పూలింగ్‌కు రైతులకు భూములు ఇచ్చారని.. కానీ ఇప్పటికీ వారికి ప్లాట్లు అప్పగించలేదని, అసలు కేటాయింపులు చేయలేదని.. దీనిని ఎలా సమర్థించుకుంటారని.. లక్ష ఎకరాలు రాజధానికి ఏం చేసుకుంటారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. వీజీటీఎం కాన్సెప్ట్ (విజయవాడ?గుంటూరు?తెనాలి?మంగళగిరి) విభజన చట్టంలోనే ఉందని.. ఈ ప్రాంతం అంతటికీ రాజధాని భవనాలను విస్తరిస్తే అందులో పోయేది ఏం ఉంటుందని ప్రశ్నించారు విజయసాయి.ప్రధానంగా రాజధాని నిర్మాణం పేరుమీద అవినీతి జరుగుతోందని.. కూటమి ప్రభుత్వం రాజధాని కోసం ఏకంగా రూ.50 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నార విజయసాయి. అమరావతిలో జరుగుతున్న ప్రతి నిర్మాణంలో భారీగా నిర్మాణ వ్యయాన్ని పెంచి చూపించారని ఆరోపించారు. దీన్ని బట్టి రాజధానిలో అవినీతికి పథకం వేస్తున్నారని.. అందుకే అమరావతి అనే అందమైన పేరు పెట్టారన్నారు. అమరావతిని దేవతల రాజధాని అంటూ బ్రహ్మాండమైన అబద్ధపు బ్రాండింగ్ ఇచ్చారన్నారు. నేరుగా అధికారంలో ఉన్న వారు ఈ దేవతల రాజధాని బ్రాండింగ్ వాడుకుంటూ 25 నుంచి 30 శాతం డబ్బును లంచాలుగా తీసుకుంటున్నారని ఆరోపించారు. వాస్తవానికి అమరావతిలో ఉన్న అమరేశ్వరుడి ఆలయం, బుద్ధ విగ్రహం ఉన్న అమరావతికి.. ఇప్పుడు నిర్మాణం చేస్తున్న బిల్డింగులు ఉన్న ప్రాంతం 50 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. అమరావతి దైవ క్షేత్రం, కృష్ణమ్మ ప్రవహిస్తున్న క్షేత్రం అయితే.. ఈ అమరావతి అవినీతి పారుతున్న క్షేత్రం అని ఘాటుగా స్పందించారు.'అమరావతి బిల్డింగుల నిర్మాణానికి ఏకంగా రూ 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు అందులో 25?30 శాతం అవినీతికి ఆస్కారం కనిపిస్తున్నప్పుడు.. ఈ అవినీతిని మనమంతా ప్రజలుగా మొదట ప్రశ్నించాలి. అంటే ఇది దాదాపు 15 వేల కోట్ల లంచాల మేతకు వేసిన పథకం. మరి ఈ విషయాన్ని వదిలేసి మావిగన్ అనటం వల్ల ప్రయోజనం ఏమిటి? మరో మూడేళ్ళలో జరిగిపోయే నిర్మాణాలన్నీ ఏం చేద్దాం? రాజధానిని నిర్మించటం అంటే అవినీతికి బాగా ఆస్కారం ఉన్న బిల్డింగులు ఏ పార్టీ కట్టాలి... ఎంత కమిషన్లు కొట్టాలి అన్నది కాదు కదా?. కాబట్టి, అమరావతి పేరిట జరుగుతున్న అవినీతి యజ్ఞాన్ని ప్రజలందరి తరఫున ప్రశ్నిస్తూ, ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో అవినీతిని సవాలు చేస్తూ త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను' అంటూ విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.

# డీజీ రైతు బజార్లకు భారీ స్పందన

విశాఖపట్టణం, జూలై 4 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాంభించిన డీజీ రైతుబజార్లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. డీజీ రైతు బజార్లలో నామమాత్రంగా డెలివరీ ఛార్జీల వసూలు చేస్తున్నారు. దీంతో వినియోగదారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. జూన్ నెలలో ఆర్డర్లు 5,800 దాటాయి.. దీంతో నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఈ డీజీ రైతు బజార్లను విస్తరిస్తామని అధికారులు చెబుతున్నారు. విశాఖ మాత్రమే కాదు రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల కోసం వినూత్న ఆలోచన చేసింది.. ఇంటికే కూరగాయల్ని హోం డెలివరీ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లో డీజీ రైతు బజార్లను ప్రారంభించింది. మార్కెటింగ్ శాఖ ప్రారంభించిన ఈ రైతు బజార్లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో గతేడాది డిసెంబర్‌లో రైతు బజార్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఆ తర్వాత మధురవాడ, గాజువాక, గోపాలపట్నం, నరసింహనగర్‌లో ఏర్పాటు చేశారు. నగరంలోని ఐదు డీజీ రైతుబజార్ల నుంచి జూన్ నెలకు సంబంధించి 5,800కుపైగా హోం డెలివరీలు చేశారు. నగరంలో కేవలం 10 నిమిషాల్లోనే కూరగాయలు చేరవేస్తుండటంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.డీజీ రైతు బజార్లలో తాజా, నాణ్యమైన కూరగాయలను ప్రజలు అందిస్తున్నారు. కూరగాయల్ని చేరవేసేందుకు డెలివరీ బాయ్స్‌ను నియమించారు.. రోజుకు 12 గంటల పాటూ సేవలు అందిస్తున్నారు. వీరికి నెలకు రూ.19 వేల జీతం ఇస్తున్నారు. డెలివరీ బాయ్స్ ఆర్డర్ రాగానే కూరగాయల్ని గ్రేడింగ్ చేసి హోం డెలివరీ చేస్తున్నారు. ఒకవేళ కూరగాయలు నాణ్యంగా లేకపోతే మళ్లీ మార్చి ఇస్తారు. దీంతో ప్రజల నుంచి ఆదరణ పెరిగిందని చెబుతున్నారు. ఈ డీజీ రైతు బజార్ల నుంచి ఐదు కిలో మీటర్ల వరకు మాత్రమే ఈ సేవలు అందిస్తున్నారు. అందుకే కేవలం 10 నిమిషాల్లోనే కూరగాయాలు వినియోగదారులకు అందుతున్నాయి.కూరగాయలు హోం డెలివరీ చేసినందుకు నామమాత్రపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్కో ఆర్డర్‌కు కిలోమీటర్‌కు రూ.1 డెలివరీ ఛార్జ్.. హ్యాండ్లింగ్ ఛార్జీల కింద రూ.10 వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు రూ.100కు కూరగాయలు ఆర్డర్ పెడితే రూ.115 (రూ.100 కూరగాయలు+ఐదు కిలోమీటర్లకు రూ.5 డెలివరీ ఛార్జ్+హ్యాండ్లింగ్ ఛార్జ్ రూ.10) వసూలు చేస్తారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల వరకు ఈ డీజీ రైతు బజార్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రజల నుంచి మంచి ఆదరణ పెరగడంతో నగరంలోని మరికొన్ని చోట్ల రైతు బజార్లను విస్తరిస్తామని అధికారులు చెబుతున్నారు.

# ఢిల్లీలో రూ.105 కోట్లతో సరికొత్త ఏపీ భవన్..!

విజయవాడ, జూలై 4, దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను చాటేలా సరికొత్త ఏపీ భవన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. విభజన అనంతరం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ భవన నిర్మాణ ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. అక్షరాలా రూ.105 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ నూతన భవనాన్ని నిర్మించనున్నారు. ఢిల్లీకి వచ్చే రాష్ట్ర పౌరులకు, ప్రజాప్రతినిధులకు మరియు అధికారులకు అత్యుత్తమ సేవలు అందించేలా, అన్ని రకాల అత్యాధునిక వసతులతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు.ఈ నూతన ఏపీ భవనాన్ని సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇది కేవలం ఒక అతిథి గృహంగానే కాకుండా, ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన పూర్తి స్థాయి పరిపాలన మరియు ఆతిథ్య కేంద్రంగా సేవలందించనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన దౌత్యపరమైన సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో చర్చలు, మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేలా ఇందులో కాన్ఫరెన్స్ హాళ్లు, వీఐపీ లాంజ్‌లు మరియు ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.ఈ ప్రతిష్టాత్మక భవన నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'నేషనల్ బిల్డింగ్స్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్' కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వ నిర్మాణ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనాలను నిర్మించడంలో ఎన్‌బీసీసీకి మంచి గుర్తింపు ఉంది. ఈ కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలోనే అత్యంత నాణ్యతతో కూడిన హంగులతో ఈ నూతన ఏపీ భవన్ నిర్మాణం పూర్తి కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 12 ఏళ్ల తర్వాత, ఢిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల పంపిణీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో సాగిన సుదీర్ఘ వివాదానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం ప్రకారం.. ఏపీ వాటాగా వచ్చిన భూమిలోనే ఈ సరికొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.

# మావిగన్ పై ధర్మాన ఆగ్రహం..

శ్రీకాకుళం, జూలై 4, రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగారు కొందరు నాయకులు. కానీ ఏపీలో రాజకీయాలు మారిపోవడంతో వారి బాధ అంతా కాదు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రస్థాయి నేతలుగా చలామణి అయ్యారు. చాలా స్వేచ్ఛగా రాజకీయాలు చేశారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంట్రీ తో చాలామంది నేతల తలరాతలు మారిపోయాయి. రాజకీయాల్లో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు వారి వ్యవహార శైలి ఉంది. పదవులు సైతం ఉన్నా అధికారం వెలగబెట్టలేని పరిస్థితి వారిది. ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో వారు సతమతం అవుతున్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో పలుచన అవుతున్నారు. రాజధానుల అంశానికి సంబంధించి జగన్మోహన్ రెడ్డి వైఖరితో విసిగి వేసారి పోతున్నారు కొంతమంది సీనియర్లు. అటువంటి వారిలో ధర్మాన ప్రసాద రావు ముందుంటారు. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉండే ధర్మాన.. అదే జగన్మోహన్ రెడ్డి కింద పని చేయాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయం లేకపోవడంతో జగన్ విధానాలను సమర్థించాల్సి వచ్చింది. ఇప్పుడు అవే చేటు తెస్తున్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా వ్యవహరించారు ధర్మాన ప్రసాదరావు. తొలి మూడేళ్లు ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. దీంతో మౌనమునిగా మారిపోయారు. మంత్రి పదవి ఇచ్చేసరికి యాక్టివయ్యారు. జగన్మోహన్ రెడ్డి మంచితనాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయనకు విశాఖ పాలన రాజధాని అస్త్రం దొరికింది. గ్రామాల్లో ఏకంగా సభలు ఏర్పాటు చేసి జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర కోసం విశాఖను రాజధానిగా చేర్చారని.. ఆయన రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ ప్రజలు ఆ మాటలను విశ్వసించలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించలేదు.అయితే జగన్మోహన్ రెడ్డి మావిగన్ స్టాండ్ తీసుకోవడంతో ధర్మాన ప్రసాదరావు లాంటివారు డిఫెన్స్ లో పడిపోయారు. వాస్తవానికి 2014 ముందు ధర్మాన ప్రసాదరావు కాంగ్రెస్ పార్టీ నేతగా ఉంటూ.. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన చెప్పే మాటకు విశ్వాసం, విశ్వసనీయత ఉండేది. మంచి వాగ్ధాటితో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపగల నాయకుడిగా పేరు ఉండేది. ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి.. జగన్మోహన్ రెడ్డి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం.. అవి ఎప్పటికప్పుడు మారిపోతుండడంతో ధర్మాన ప్రసాదరావు వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేసేలా చేశాయి. వాస్తవానికి ధర్మాన ప్రసాదరావు జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని విభేదిస్తారన్న కామెంట్ ఉంది. జగన్ వైఖరిని పెద్దగా ఇష్టపడరని కూడా అనుచర వర్గం చెబుతుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో.. గత్యంతరం లేని స్థితిలో జగన్ పంచన చేరారు అని కూడా కామెంట్స్ ఉన్నాయి. కానీ అదే జగన్ విధానాలను బలంగా బలపరిచి ధర్మాన ప్రసాదరావు మరింత బలహీనం అయ్యారు. విశాఖ రాజధాని విషయంలో అతి చేశానని.. మావిగన్ స్టాండ్ తో జగన్మోహన్ రెడ్డి దారుణంగా దెబ్బతీశారన్న ఆవేదనతో ఉన్నారట ధర్మాన. చూడాలి ధర్మాన ఎలా ముందుకు వెళ్తారో..

# విజయనగరంలో రియల్ జోరు...

విజయనగరం జూలై 4, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. మరి కొద్ది రోజుల్లోనే ప్రారంభోత్సవంతో జాతికి అంకితం చేయనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పనులన్నీ పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి ముస్తాబయింది. ఉత్తరాంధ్ర తలరాతను మార్చబోతోంది ఈ విమానాశ్రయం. అయితే ఎయిర్పోర్ట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. విజయనగరం జిల్లా సరిహద్దులతోపాటు భోగాపురం చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో భూములతో పాటు ఇళ్ల స్థలాలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టేందుకు భారీగా ముందుకు వస్తున్నారు.సాధారణంగా వెంచర్లలో ప్లాట్లు విక్రయిస్తుంటారు. కానీ భోగాపురంలో ఓపెన్ ప్లాట్ల వెంచర్ల స్థానంలో.. సరికొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కమర్షియల్ విల్లా ప్రాజెక్టులు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు వెలుస్తున్నాయి. ఎయిర్పోర్ట్ కారిడార్ ఆనుకొని ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా.. వందల ఎకరాల్లో ఆధునిక టౌన్షిప్ ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభమైతే.. ఈ ప్రాంతం ఒక పెద్ద ఎకానమిక్ హబ్ గా మారనుంది. ప్రధానంగా ప్రీమియం నివాస గృహాలకు, కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ విపరీతంగా పెరిగింది.ఉత్తరాంధ్రలో వలసలు ఎక్కువ. ఆపై చదువుకున్న వారు సైతం విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో స్థిరపడిన వారు ఉన్నారు. అటువంటి వారంతా భోగాపురం పరిసర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

## మార్కెట్ యార్డు పరిరక్షణకు జులై 18న సత్యాగ్రహం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 04:నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిలో రెండు ఎకరాలను రాజకీయ పార్టీ కార్యాలయానికి కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకుని మార్కెట్ యార్డును పరిరక్షించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం నంద్యాల శివారులో యర్రం శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. మార్కెట్ యార్డు రైతులకు ఎంతో ఉపయోగపడే ఆస్తి అని, దానిని రాజకీయ అవసరాలకు కేటాయించడం సరికాదని వక్తలు పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు, మంత్రికి వినతిపత్రాలు అందించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డు పరిరక్షణ కోసం జులై 18న నంద్యాలలో భారీ సత్యాగ్రహ దీక్ష నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో శంకరయ్య, పులికొండన్న, సోమన్న, మురళీధర్‌రెడ్డి, కుమ్మరి ప్రసాద్, చింతలయ్యతో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అల్లూరి ఆశయాలు స్ఫూర్తిదాయకం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , జులై 04:మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా టూరిజం అధికారిణి కె. విజయలక్ష్మి అన్నారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం అల్లూరి సీతారామరాజు ధైర్యంగా పోరాడి స్వాతంత్ర్య ఉద్యమంలో చిరస్థాయిగా నిలిచారన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. దేశభక్తి, త్యాగం, సేవా భావం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన ఆశయాలను యువత ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుబాకర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ కార్యాలయంలో అల్లూరి జయంతి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 04: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ



సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను సమీకరించి రంపా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) చిన్నికృష్ణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు బాబు, విజయ్, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డిజిటైజేషన్ వేగవంతం చేయాలి--

### మున్సిపల్ కమిషనర్ బి శేషన్న--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 04: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ అనంతరం డిజిటైజేషన్‌ను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న బీఎల్‌వోలకు సూచించారు. శనివారం నిర్వహించిన సమీక్షలో గడువులోపు అన్ని పనులు పూర్తి చేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను ఈ నెల 14వ తేదీలోపు ఓటర్ల నుంచి సేకరించి, వాటిలోని వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పరిశీలించి వెంటనే డిజిటైజేషన్ చేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తులో పేరు, చిరునామా, కుటుంబ వివరాలు, జనన తేదీ, అవసరమైన ఇతర సమాచారం స్పష్టంగా నమోదు అయ్యేలా చూడాలని తెలిపారు. పత్రాలు నింపే విధానం, నమోదు చేయాల్సిన వివరాలు, జత చేయాల్సిన ధ్రువపత్రాలు, 2002 నాటి ఓటర్ల జాబితాలో వివరాలను గుర్తించే విధానం, అప్పట్లో ఓటు నమోదు లేకపోతే అనుసరించాల్సిన ప్రక్రియ వంటి అంశాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటర్లు అడిగే ప్రతి సందేహాన్ని ఓర్పుతో నివృత్తి చేసి, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హుడైన ఓటరిని కలుసుకుని ఎన్యూమరేషన్ పత్రాలను సకాలంలో సేకరించడంతో పాటు, డిజిటైజేషన్ పనులు ఆలస్యం కాకుండా ప్రతిరోజూ పురోగతిని నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారు. డేటా నమోదు సమయంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, నాణ్యతతో పాటు వేగానికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తిచేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న బీఎల్ఓల కు ఆదేశించారు.

## పన్నుల వసూళ్లు, ఓటరు నమోదు వేగవంతం చేయాలి--

### మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 4:నంద్యాల పట్టణంలోని ఎంఎస్ నగర్ సచివాలయాన్ని శనివారం మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటి పన్ను, కొళాయి



పన్ను వసూళ్లతో పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం అమలును సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంటి పన్ను, కొళాయి పన్ను బకాయిల వసూళ్లను వేగవంతం చేసి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని లక్ష్యాలకు అనుగుణంగా సమకూర్చాలని సూచించారు. అదే విధంగా అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయడంతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపుల దరఖాస్తులను నిబంధనల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సచివాలయ రికార్డులు, పన్నుల వసూళ్ల పురోగతి, ఓటరు నమోదు వివరాలను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలు అందిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై రైతులకు అప్రమత్తత

### వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి--
### వీసీ డా. పి.వి. సత్యనారాయణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 04:రానున్న జూలై, ఆగస్టు నెలల్లో ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం ఎక్కువగా ఉండే వరి సాగును తగ్గించి ఆరుతడి (మెట్ట) పంటలను సాగు చేయాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ సూచించారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నిర్వహించిన ఎల్‌నినో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితులను ప్రతి వారం సమీక్షిస్తూ రైతులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు, సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు. పరిశోధనా సంచాలకులు డా. వి. సుమతి మాట్లాడుతూ తక్కువ వర్షపాతం ప్రాంతాలకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధం చేసినట్లు, అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సదస్సులో శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అంచనాలు, రాయలసీమలో తీసుకోవాల్సిన వ్యవసాయ జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో తొమ్మిది జిల్లాల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రాల ప్రతినిధులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.




## ఆలయ ఆధునికరణకు భక్తుల ఉదార విరాళాలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 04:నంద్యాల తెలుగు పేటలోని శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధునికరణ పనులకు భక్తులు ఉదారంగా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేర్లతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి



అనుగ్రహం దాతల కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఇర్ల మధుసూదన్ రాయల్ తెలిపిన వివరాల ప్రకారం, నంద్యాల జిల్లా పాణ్యం గ్రామానికి చెందిన నటవ లక్ష్మీనారాయణ తన దివంగత ధర్మపత్ని శ్రీమతి లత స్మారకార్థం కుమారులతో కలిసి రూ. 50,116 విరాళం అందజేశారు. అలాగే నంద్యాల ఎన్‌జీఓ కాలనీకి చెందిన ఎర్రబోయిని రామాంజనేయులు, ఆయన ధర్మపత్ని శ్రీమతి గుర్రమ్మ కుటుంబ సభ్యులతో కలిసి రూ. 25,116 విరాళం అందించారు. గుడిపాడిగడ్డకు చెందిన మాజీ సైనికుడు సానే గోవిందప్ప, ఆయన ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో కలిసి రూ. 10,116 విరాళం సమర్పించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని దేవస్థానం కమిటీ పేర్కొంటూ, దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

## కామ్రేడ్ ఎర్రగుడి రాముడు మృతి--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 04:భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. రంగనాయుడు తండ్రి, పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ ఎర్రగుడి రాముడు శనివారం మధ్యాహ్నం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా నంద్యాల సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా సమితి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ బలోపేతానికి, రైతు–కార్మిక ఉద్యమాలకు కామ్రేడ్ రాముడు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్నతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశా సమస్యలపై వినతి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 04:ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు జి. రమణకుమారి డిమాండ్ చేశారు. శనివారం



ఆమె నాయకత్వంలోని ప్రతినిధి బృందం జిల్లా వైద్యాధికారి డా. ఆర్. వెంకటరమణను కలిసి వినతిపత్రం సమర్పించింది .జులై 31న కలెక్టరేట్ల వద్ద జరిగే స్కీమ్ వర్కర్ల ఆందోళనలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. తక్కువ వేతనాలు, అధిక పనిభారం, విధి నిర్వహణ ఖర్చుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాళు లలితమ్మ, శిరోమణి, మద్దమ్మ, వసంతమ్మ, నయోమి పాల్గొన్నారు.

## రొయ్యల్లో 'వైట్ గట్' వ్యాధిపై అప్రమత్తమైన ప్రభుత్వం..

అమరావతి: రాష్ట్రంలో రొయ్యల సాగులో 'వైట్ గట్' వ్యాధి లక్షణాలపై మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన నివారణ చర్యలను వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు మత్స్యశాఖ అధికారులు సంబంధిత ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలిస్తున్నారు. మహదేవిపట్నంలోని ప్రభావిత రొయ్యల చెరువును అధికారులు సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు. అక్కడి నుంచి నీరు, రొయ్యలు, ఫీడ్, ఫీకల్ నమూనాలను సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలలకు పంపించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**